GSTIN-NO:36FKPSI308PIZX

epaper:tmedia.net.in

# టి-మీడియా

సామాజికం... ప్రజల పక్షం

మెయిన్

సంపుటి : 7 | సంచిక : 248 | ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ | శనివారం 08-03-2025 | పేజీలు : 3




# వరంగల్‌లో రజతోత్సవ బహిరంగ సభ

- బీఆర్ఎస్ యే తెలంగాణకి రక్షణ
- ఆ పార్టీ అధినేత కేసీఆర్





**టీ మీడియా, మార్చి 7, హైదరాబాద్ బ్యూరో :**

తెలంగాణ ప్రజల ఆకాంక్షలను మొదటి నుంచి కాపాడుకుంటూ వస్తున్న బీఆర్ఎస్ పార్టీయే తెలంగాణ సమాజానికి రాజకీయ రక్షణను, పాలనా పరిరక్షణను అందించగలదని, ఈ విషయం గత పద్నాలుగు నెలల కాంగ్రెస్ ప్రభుత్వ పాలన ద్వారా మరోసారి స్పష్టమైందని ఆ పార్టీ అధినేత కేసీఆర్ అన్నారు. తెలంగాణ సమాజంలో రాష్ట్ర ప్రభుత్వం పట్ల ప్రజల్లో నెలకొన్ని అసంతృప్తి అనిశ్చితే నిదర్శనమని పునరుద్ఘాటించారు. బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భవించి ఏప్రిల్ 27వ తేదీకి 25 ఏండ్లు కావస్తున్న నేపథ్యంలో రజతోత్సవ వేడుకల్లో భాగంగా.. వరంగల్ జిల్లాలో లక్షలాది మందితో భారీ బహిరంగ సభ నిర్వహించాలని అధినేత కేసీఆర్ నిర్ణయించారు. ఈ మేరకు వరంగల్ సమీపంలోని విశాలమైన అనువైన ప్రదేశాలను పరిశీలించి త్వరలో సభావేదిక స్థలాన్ని నిర్ణయించనున్నట్లు తెలిపారు. ఈ మేరకు ఎర్రవెల్లి నివాసంలో శుక్రవారం జరిగే కీలక సమావేశంలో ఇందుకు సంబంధించి సుదీర్ఘ చర్చ జరిగింది. ఈ సందర్భంగా కేసీఆర్ మాట్లాడుతూ.. దశాబ్దాల పాటు పోరాటాలు నడిపిఎన్నోత్యాగాలతోతెలంగాణనుసాధించుకున్నామని తెలిపారు. అనంతరం పదేండ్ల పాటు ఎంతో అప్రమత్తతతో తెలంగాణ స్వరాష్ట్రంలో పాలనను దేశానికే ఆదర్శంగా నిలుపుకున్నామని.. అంతటి గొప్ప ప్రగతిని సాధించిన తెలంగాణ సమాజం నేడు మోసపోయి గోసపడుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటువంటి సందర్భంలో నిర్వహించుకుంటున్న రజతోత్సవ వేడుకలు, కేవలం బీఆర్ఎస్ పార్టీకే పరిమితం కాదని, యావత్ తెలంగాణ సమాజానికి అందులో భాగస్వామ్యం ఉందని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ తెలంగాణ ప్రజలు నిర్మించుకున్న రాజకీయ అస్థిత్వ పార్టీ. ఇది తెలంగాణ ప్రజల పార్టీ. ప్రజలు బీఆర్ఎస్‌ను తెలంగాణ పార్టీగా తమ సొంతింటి పార్టీగా భావిస్తారు. ప్రజలు ఇవాళ అనేక కష్టాల్లో ఉన్నారు. వారి రక్షణ బీఆర్ఎస్ పార్టీనే అని నమ్ముతున్నారు.' అని కేసీఆర్ తెలిపారు. కాంగ్రెస్ ఆశపెట్టిన గ్యారంటీలను, వాగ్దానాలను నమ్మిన ప్రజలు రాష్ట్ర ప్రభుత్వ నిజస్వరూపం తెలుసుకున్నారని పేర్కొన్నారు. ఇక ఎప్పుడు ఎన్నికలు వచ్చినా బీఆర్ఎస్‌కు బ్రహ్మరథం పట్టేందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు. ఈ సందర్భంగా వరంగల్‌లో నిర్వహించే భారీ బహిరంగసభకు లక్షలాదిగా ప్రజలు తరలివస్తారని సమావేశంలో ఆశాభావం వ్యక్తమైంది. బహిరంగ సభ సన్నాహక సమావేశాలను నియోజకవర్గాల వారీగా నిర్వహించాలని, అందుకు త్వరలో కమిటీలను వేయనున్నట్టు కేసీఆర్ తెలిపారు. వరంగల్ బహిరంగ సభ అనంతరం.. బీఆర్ఎస్ పార్టీని గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు సంస్థాగతంగా పటిష్ట పరిచి , ఆ దిశగా కొత్త కమిటీలను ఏర్పాటు చేస్తామని అన్నారు. ఆ తర్వాత నూతన కమిటీల బాధ్యులతో ప్రతినిధుల సభను ఏర్పాటు చేయనున్నట్టు చెప్పారు. బీఆర్ఎస్ పార్టీలో యువత, మహిళా భాగస్వామ్యం పెంచాలని నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్రంతో పాటు, దేశంలో నడుస్తున్న వర్తమాన రాజకీయ పరిస్థితులపై సమావేశంలో సుదీర్ఘ చర్చ జరిగింది. అందుకనుగుణంగా పార్టీ తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అనుసరించాల్సిన వ్యూహాలు అమలుచేయాల్సిన రాజకీయ ఎత్తుగడలపై లోతైన చర్చ జరిగింది. గత ఒడిదొడుకులను అనుభవాలను పరిగణలోకి తీసుకుని వాటిని విశ్లేషిస్తూ, వర్తమానానికి అన్వయించుకుంటూ భవిష్యత్తుకు బాటలు వేసుకునే విధంగా కార్యాచరణను అమలు పరచాలని సమావేశంలో నిర్ణయించారు. కేంద్రంలో ఏ పార్టీ ప్రభుత్వం ఉన్నా కూడా, తెలంగాణ సమాజానికి మొదటి నుంచీ అవి వ్యతిరేకంగానే పని చేస్తున్నాయని సమావేశంలో ఆవేదన వ్యక్తమైంది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో పార్టీని పటిష్టం చేసుకొని దేశ రాజకీయాల్లో జరుగుతున్న పరిణామాల పట్ల నిత్యం అప్రమత్తతతో ఉండాలని సమావేశం భావించింది. తెలంగాణ ఇంటి పార్టీ ప్రాతినిథ్యం పార్లమెంటులో లేకపోవడం వలన తెలంగాణ హక్కులకు భంగం వాటిల్లుతుందని అంశంపై చర్చ జరిగింది. ఇదే విషయాన్ని ప్రజలకు మరింతగా అర్థం చేయించి పార్లమెంటులో బీఆర్ఎస్ ఎంపీలు ప్రాతినిథ్యం ఉండి రాష్ట్ర హక్కులను కాపాడుకునే దిశగా ప్రజల్లో చైతన్యాన్ని పెంపొందించాలని సమావేశంలో నిర్ణయించారు. కాగా పలు అంశాలపై చర్చ సందర్భంగా అధినేత అందరి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో పాల్గొన్న నేతలు వారి వారి అభిప్రాయాలను అధినేత ముందుంచారు. దాదాపు ఎనిమిది గంటల పాటు సాగిన సుదీర్ఘ చర్చలో.. తెలంగాణ ప్రజల ప్రయోజనాలను దెబ్బతీస్తున్న రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాల వైఖరులను తిప్పి కొడుతూ తెలంగాణ సమాజ ఆకాంక్షలకు అనుగుణంగా భారీ బహిరంగ సభను నిర్వహించాలని కేసీఆర్ అధ్యక్షతన సాగిన సమావేశం నిర్ణయించింది.

## కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లకు భట్టి విక్రమార్క ఫోన్



### ప్రజాభవన్‌లో అన్ని పార్టీల ఎంపీల సమావేశం

**టీ మీడియా, మార్చి 7, హైదరాబాద్ బ్యూరో:**

కేంద్ర ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉన్న అంశాలపై ఒత్తిడి తెచ్చేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే ముఖ్యమంత్రికి రేవంత్ రెడ్డి ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రులను కలిసి మూసీ పునరుజ్జీవనం, మెట్రో విస్తరణ, ఆర్ఆర్ఆర్ తదితర అంశాలపై విన్నవించారు. నిధులు, అనుమతుల కోసం ప్రధాని, మంత్రులను కలిసి వినతి పత్రాలు ఇచ్చినప్పటికీ సరైన స్పందన రావడం లేదని ప్రభుత్వం అసంతృప్తితో ఉంది. దీంతో పెండింగ్ ప్రాజెక్టులకు నిధుల సాధనకు పార్లమెంట్‌లో ఎంపీలు ప్రస్తావించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం వ్యూహరచన చేస్తోంది. గురువారం కేబినెట్ సమావేశం ముగిసిన తర్వాత సీఎం, మంత్రులు ఈ అంశంపై చర్చించి అన్ని పార్టీల ఎంపీలను కలుపుకొని కేంద్రాన్ని కోరాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా ప్రజాభవన్‌లో శనివారం అన్ని పార్టీల ఎంపీల సమావేశం నిర్వహించాలని నిర్ణయం తీసుకుంది. కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లకు భట్టి విక్రమార్క ఫోన్ : ప్రజాభవన్?లో రేపు ఉదయం 11 గంటలకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధ్యక్షతన అన్ని పార్టీల సమావేశం జరగనుంది. కేంద్ర ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉన్న అంశాలపై ఈ భేటీలో చర్చించనున్నారు. ఎంపీల సమావేశానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరుకానున్నారు. ఈ మేరకు కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్‌తో రాష్ట్రంలోని అందరు ఎంపీలకు భట్టి విక్రమార్క స్వయంగా ఫోన్ చేసి సమావేశానికి ఆహ్వానించారు.

## వచ్చేవారం నుంచి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు :

### మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



**టీ మీడియా, మార్చి 7, పాలేరు :**

వచ్చేవారం నుంచి రాష్ట్ర వ్యాప్తంగా నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చే కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. శుక్రవారం నాడు పాలేరు నియోజకవర్గంలోని కూసుమంచి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంత్రిగారు మాట్లాడుతూ పేదవారి ప్రభుత్వం కావాలని ఇందిరమ్మ రాజ్యం తెచ్చుకుని ఈ రోజుతో 15 నెలలు అయ్యిందని గత ప్రభుత్వ నిర్వాకం వల్ల రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అస్తవ్యస్థంగా తయారైందని అయినా కూడా తెలంగాణ ప్రజానీకానికి ఎన్నికలలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటి అమలు చేసుకుంటూ ముందుకెళు_న్నామన్నారు. అర్హులైన వారికి అందరికీ రేషన్ కార్డులు ఇస్తాం,రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు బాగోలేని కారణంగా తులం బంగారం లేటవుతుంది. ఆనాటి ప్రభుత్వం అభివృద్ధి పేరుతో అరాచకం సృష్టించింది. వాటన్నింటినీ గాడిన పెడుతూ అభివృద్ధి, సంక్షేమం చేపడుతున్నాం. ఎక్కడ తగ్గకుండా సంక్షేమ కార్యక్రమాలు చేపట్టాం. పేదవారి కోసం ఇందిరమ్మ ప్రభుత్వం చిత్త శుద్ధితో పని చేస్తోంది. ఇచ్చిన ప్రతి మాటను..హామీని ఆలస్యమైనా నిలబెట్టుకుంటామని మంత్రి పొంగులేటి తెలిపారు.




## చరిత్ర సృష్టించబోతున్న మహిళా సంఘాలు

### ఒకే రోజు 5 కోట్ల ఈ-వ్యాపారం

**టీ మీడియా, మార్చి 7, అమరావతి :**

అంచెలంచెలుగా ఎదిగి ఉన్నత శిఖరాలకు చేరుకున్న వ్యక్తి గురించో, అలాగే చిన్నగా ప్రారంభించి దినదినాభివృద్ధి సాధించిన సంస్థ గురించో చెప్పేటప్పుడు 'ఇంతింతై వటుడింతయై అన్నట్టు ఎదిగిపోయారు' అని చెప్పుకుంటుంటాం. అలాంటి నానుడి స్వయం సహాయక సంఘాలకు సరిగ్గా సరిపోయేలా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మహిళా దినోత్సవం రోజున ప్రత్యేకంగా ఓ కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నారు. స్వయం సహాయ సంఘాలు తయారు చేసిన ఉత్పత్తులకు ఒకే రోజు 5 కోట్ల ఈ-వ్యాపారం చేయించడం ద్వారా అరుదైన గిన్నిస్ బుక్ రికార్డును సాధించేందుకు సమాయాత్తమయ్యారు. అందుకు ప్రకాశం జిల్లా మార్కాపురం వేదికగా మారనుంది. ఆ విశేషాలేంటో ఇప్పుడు తెలుసుకుందాం..స్వయం సహాయక సంఘాలు తయారు చేసిన వివిధ రకాల ఉత్పత్తుల విక్రయాల్లో రాష్ట్రం దేశంలోనే ప్రథమ స్థానంలో నిలవనుంది. ఇది ఎలా సాధ్యమైందన్న దానిపై పరిశీలన చేసి గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు తన బుక్‌లో ఏపీ స్వయం సహాయక సంఘాలకు ఒక పేజీ కేటాయించనుంది. మార్చి 8వ తేదీన అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రకాశం జిల్లాలోని మార్కాపురం ఇందుకు వేదిక కానుంది. ఈ కార్యక్రమంలో పాల్గొననున్న సీఎం చంద్రబాబు నాయుడు ఒకే రోజు 5 కోట్ల రూపాయల విలువైన ఉత్పత్తులను కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని ఓఎన్‌డీసీ (ఓపెన్ నెట్ వర్క్ ఫర్ డిజిటల్ కామర్స్) ఆన్‌లైన్ ప్లాట్ పారం ద్వారా విక్రయించనున్నారు. ఇప్పటికే 3 లక్షల ముందస్తు ఆర్డర్లు వచ్చాయి. ఈ విక్రయాలను ఏపీ సీఎం చంద్రబాబు మార్కాపురంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన సదస్సులో బటన్ నొక్కి ప్రారంబిస్తారు. స్వయం సహాయక సంఘాలు ఇంత పెద్ద ఎత్తున తమ ఉత్పత్తులను ఒకే రోజున భారీ ఎత్తున విక్రయించి గిన్నిస్ వరల్డ్ రికార్డు సాధించనున్నాయి. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల ఉత్పత్తుల మార్కెటింగ్ కోసం కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని ఓఎన్‌డీసీ రాష్ట్రంలోని స్వయం సహాయక సంఘాలు వినియోగించుకునేలా అధికారులు చర్యలు చేపట్టారు.. ఆన్‌లైన్ ద్వారా చేసే ఈ డిజిటల్ మార్కెటింగ్ కోసం ఎలాంటి సర్వీస్ ఛార్జీలు చెల్లించాల్సిన అవసరం లేదు. అలాగే కొన్ని స్టార్టప్ కంపెనీలు రూపొందించిన యాప్‌ల ద్వారా సంఘాలు తయారు చేస్తున్న వేల రకాల ఉత్పత్తులను ప్రజలకు పరిచయం చేస్తున్నారు. వీటికి మంచి స్పందన రావడంతో ఇందులో ఒకేరోజు లక్షకు పైగా ఆర్డర్ల ద్వారా ప్రపంచ రికార్డు సాధించేలా ప్రణాళిక తయారు చేశారు.

గత ఫిబ్రవరి 27వ తేదీన ప్రారంభమైన ఆర్డర్లు అంచనాలకు మించి 3 లక్షల వరకు వచ్చాయి. ప్రస్తుతానికి ఏపీ వ్యాప్తంగా డెలివరీ చేసే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మార్కాపురం సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు బటన్ నొక్కి ప్రారంభించే ఈ డిజిటల్ మార్కెటింగ్ కార్యక్రమాన్ని గిన్నిస్ వరల్డ్ రికార్డ్ ప్రతినిధులు పరిశీలిస్తారు. అనంతరం సర్టిఫికెట్ ఇవ్వనున్నారు. మార్చి 8వ తేదీన బుక్ అయిన ఈ ఆర్డర్లు కొనుగోలు దారులకు డెలివరీ చేస్తారు.

### పచ్చళ్లు, పిండి వంటలకు ఆదరణ

రాష్ట్రవ్యాప్తంగా స్వయం సహాయక సంఘాల ద్వారా తయారు చేసిన ఉత్పత్తులను ప్రీ బుకింగ్ విధానంలో ఇప్పటికే వివిధ రకాల పచ్చళ్లు, కారాలు, తినుబండారాలు, జూట్ ఉత్పత్తుల కొనుగోళ్లకు విదేశాల నుంచి కూడా ఆర్డర్లు వస్తున్నాయి. ఇప్పటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా వచ్చిన మూడు లక్షల ఆర్డర్లలో ఇవే ఎక్కువగా ఉన్నాయి. ఈ-కామర్స్ వేదికను మహిళా సంఘాలు మరింత విస్తృతంగా ఉపయోగించుకోవడంపై అవగాహన కల్పించేందుకు మెప్మా, సెర్ప్ ఆధ్వర్యంలో పలువురు మహిళలు శిక్షణ పొందారు. మెప్మా ద్వారా తాము తయారు చేసుకున్న ఉత్పత్తులను దేశంలోనే కాకుండా విదేశాలకు కూడా ఎగుమతి చేయగలుగుతున్నామని ఒంగోలులోని స్వయం సహాయక సంఘాల ద్వారా చిన్న తరహా పరిశ్రమలు ఏర్పాటు చేసుకుని విజయవంతంగా వ్యాపారాలు చేస్తున్న మహిళా వ్యాపారవేత్త శిరీష చెబుతున్నారు. స్వయం సహాయక సంఘాల ద్వారా ఏర్పాటు చేసుకున్న చిన్న పరిశ్రమలు తమ ఉత్పత్తులకు మెరుగైన మార్కెటింగ్ సౌకర్యాలు ఏర్పాటు చేసుకునేందుకు మెప్మా సహాయ పడటంతో ఇప్పుడు వాటిని విస్తరణ దిశగా మహిళలు అడుగులు వేస్తున్నారు. తమతో పాటు పది మందికి ఉపాధి కల్పిస్తున్నారు. తొలుత చిన్నగా ప్రారంభించిన ఉత్పత్తులను ఇప్పుడు విదేశాలకు సైతం ఎగుమతులు చేసే విధంగా ఆన్‌లైన్ మార్కెటింగ్ ద్వారా అవకాశాలు వస్తున్నాయని స్వయం సహాయక బృందాల్లోని సభ్యులు చెబుతుండటం విశేషం..!

## ఆర్టీసీ ఉద్యోగులకు శుభవార్త

### ఉద్యోగులకు 2.5 శాతం డీఏ

**టీ మీడియా, మార్చి 7, హైదరాబాద్ బ్యూరో :**

తెలంగాణ ఆర్టీసీ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త అందించింది. ఆర్టీసీ యాజమాన్యంతో చర్చించి ఆర్టీసీ ఉద్యోగులకు 2.5 శాతం డీఏ ప్రకటిస్తున్నట్లు రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. 2.5 శాతం డీఏ వల్ల ఆర్టీసీపై ప్రతి నెల రూ.3.6 కోట్ల భారం పడనుందని మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. మహాలక్ష్మి పథకం ప్రారంభించిన తరువాత ఇప్పటి వరకు 150 కోట్ల మంది మహిళలు ఉచితంగా ప్రయాణించారని, దీనివల్ల ఉద్యోగులపై పని ఒత్తిడి పెరిగినా వారు నిరంతరం శ్రమిస్తున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ అభినందించారు. మహిళా ప్రయాణికుల సంఖ్య భారీగా పెరగడంతో ఆర్టీసీ బస్సులకు డిమాండ్ పెరిగింది. మహిళా సమైక్య సంఘాల చేతే బస్సులు కొనిపించి ఆర్టీసీలో అద్దె ప్రాతిపదికన బస్సులు నడిపిస్తూ మహిళలు ఆదాయాన్ని అర్జించేలా చేయాలని భావించిన మంత్రి పొన్నం ప్రభాకర్, పంచాయతీ రాజ్ మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క తో పాటు అధికారులతో పలుమార్లు ఈ అంశంపై చర్చించారు. దేశంలోనే ఏ రాష్ట్రంలో లేని విధంగా మొదటిసారి మహిళా సంఘాల చేత ఆర్టీసీ బస్సులు అద్దె ప్రాతిపదికన పెట్టి బస్సులకు యజమానులను చేస్తూ మహిళా సాధికారత దిశగా తెలంగాణ ప్రభుత్వం విజయం సాధించింది. రాష్ట్ర ప్రభుత్వం కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా వివిధ పథకాలు ఇప్పటికే అమలులోకి తీసుకొచ్చిన విషయం తెలిసిందే. మహిళా దినోత్సవం సందర్భంగా ఇందిరా మహిళా శక్తి ద్వారా మొత్తం 600 బస్సులు మహిళా సమైక్య సంఘాల ద్వారా ఆర్టీసీ తో అద్దె ప్రాతిపదికన ఒప్పందం జరగగా రేపు మొదటి దశలో 150 బస్సులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క లాంఛనంగా ప్రారంభించనున్నారు. ఇందిరా మహిళా శక్తి బస్సులు మొదటి దశలో 150 మండలాల్లో ప్రతి మండలానికి ఒక మండల మహిళా సమైక్య సంఘం ద్వారా ఒక బస్సు రేపు ప్రారంభం కానుంది. ఈ పైలెట్ ప్రాజెక్టు పాత ఉమ్మడి జిల్లాలైన వరంగల్, ఖమ్మం, కరీంనగర్, మహబూబ్ నగర్ జిల్లాలను పైలెట్ ప్రాజెక్టు గా ఎంపిక చేసి మహిళా సంఘాలను భాగస్వామ్యం చేశారు. మండల మహిళా సమైక్య ల ద్వారా కొనుగోలు చేసిన ఇందిరా మహిళా ఆర్టీసీ బస్సుల ద్వారా బస్సుల డిమాండ్ ప్రయాణికులకు ఉపశమనం కలగనుంది. మహిళా ప్రయాణికులకు ఇబ్బందులు తొలుగుతాయని ప్రభుత్వం భావిస్తోంది.





## అనుమానాస్పదమే వివేకా హత్య సాక్షుల మృతిపైచర్చ



### మంత్రివర్గ సమావేశంలో వివరించిన డీజీపీ సీఎం చంద్రబాబు కీలక వ్యాఖ్యలు

**టీ మీడియా, మార్చి 7, అమరావతి :**

వివేకా హత్య కేసులో వరుసగా సాక్షుల మరణాలపై కేబినెట్‌లో సుదీర్ఘంగా చర్చించారు. కేబినెట్ అజెండా అంశాల తర్వాత రంగన్నతో పాటు సాక్షుల మరణాలపై మంత్రులు, సీఎం దాదాపు గంటపాటు చర్చించారు. భేటీలో పాల్గొన్న డీజీపీ రంగన్నది అనుమానాస్పద మృతేనని పోలీసుల విచారణలోనూ నిర్ధారణ అయిందని వెల్లడించారు. ఈ సందర్భంగా సీఎం కీలక వ్యాఖ్యలు చేశారు. సొంత ప్రయోజనాల కోసం రాజకీయలను జగన్ నేరపూరితంగా మార్చేశారని వ్యవస్థీకృత నేరాలు చేయడంలో ఆరితేరిన వారిని అదుపు చేయాల్సిన అవసరం ఉందని సీఎం చంద్రబాబు అన్నారు. మృతి ముమ్మాటికీ అనుమాన్పదమే: వివేకా హత్యను తొలుత గుండెపోటుగా చిత్రీకరించినట్లే సాక్షి మీడియాలో రంగన్నను పోలీసులు చంపారంటూ తొలుత ప్రసారం కావటంపై మంత్రివర్గంలో అనుమానాలు వ్యక్తమయ్యాయి. జగన్ కుట్రల పట్ల అప్రమత్తంగా ఉండాలని అందుకే తాను పదే పదే చెప్తూ వస్తున్నానని సీఎం వ్యాఖ్యానించారు. పరిటాల రవి హత్య కేసులో సాక్షులు ఇలానే చనిపోతూ వచ్చారనే విషయాన్ని గుర్తు చేశారు. రంగన్న మృతి ముమ్మాటికీ అనుమాన్పదమేనని సీఎం అన్నారు. వివేకా హత్య జరిగిన రోజు జగన్, భారతిలను హైదరాబాద్ నుంచి పులివెందుల తీసుకొచ్చిన డ్రైవర్ కూడా చనిపోయిన అంశం మంత్రివర్గంలో ప్రస్తావనకు వచ్చింది. సుదూర ప్రయాణంలో వివేకా హత్యపై జగన్, భారతీల సంభాషణను డ్రైవర్ విన్నందునే తర్వాత అనుమా నాస్పద మృతి జరిగిందని చర్చ జరిగింది. ఇప్పటివరకు ఆరుగురు చనిపోయారు: ఇలా ఇప్పటివరకు ఆరుగురు చనిపోయారని మంత్రివర్గంలో చర్చకు వచ్చింది. ఏ దురుద్దేశం లేకపోతే ఆ మీడియాలో రంగన్న మృతిని పోలీసులకు ఆపాదించాలని ఎందుకు చూస్తారని ప్రశ్నను మంత్రులు ప్రశ్నించగా, రంగన్నను హత్య చేసి దాన్ని కూడా ప్రభుత్వానికి ఆపాదించాలనే కుట్ర ఇందులో దాగి ఉందనే అనుమానాలు లేవనెత్తారు. మరో సాక్షి దస్తగిరికి వచ్చిన బెదిరింపులు అంశంపైనా చర్చ జరగ్గా ఉన్న అనుమానాలతో కేసును ఎలా ముందుకు తీసుకెళ్లాలనే అంశంపై సమాలోచనలు చేశారు. సీబీఐ పరిధిలో కేసు ఉన్నా సాక్షులను రక్షించాల్సిన బాధ్యత మనపై ఉందని సీఎం అభిప్రాయపడ్డారు. సాక్షులు అనుమానాస్పద రీతిలో మృతి చెందడం దురదృష్టకరమని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారు.

# ఎల్.ఆర్.ఎస్ ఉంటేనే ప్లాటుకు రక్షణ

- జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి



**టీ మీడియా, మార్చి 7, వనపర్తి బ్యూరో :**
మార్చి 31 చివరి నాటికి 25 శాతం రాయితీ తో ఎల్.ఆర్.ఎస్ చేయించుకొండి. ఎల్. ఆర్.ఎస్ లేని వారు మార్చి 31 తర్వాత ఇల్లు కట్టుకోవాలను కుంటే ఎలాంటి రాయితీ లేకుండా ప్రస్తుత మార్కెట్ వాల్యూ కు 14 శాతం పెనాల్టీతో రిజిస్ట్రేషన్ చేయించుకోవాల్సి ఉంటుంది.ఎల్.ఆర్.ఎస్ ఉంటేనే ప్లాటుకు రక్షణ.కచ్చా లేఅవుట్లలో ప్లాట్ ల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం కల్పించిన ఎల్.ఆర్.ఎస్ సదవకాశాన్ని కొనుగోలుదారులు సద్వినియోగం చేసుకోవాలి .మార్చి 31 నాటికి కచ్చా లే అవుట్ లు, ప్లాట్లను క్రమబద్ధీకరణ చేసుకునేందుకు ప్రభుత్వం కల్పించిన ఎల్.ఆర్.ఎస్ అవకాశాన్ని జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి సూచించారు శుక్రవారం మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ప్రిన్సిపల్ సెక్రెటరీ దాన కిషోర్ ఎల్.ఆర్.ఎస్ పై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వనపర్తి జిల్లా కలెక్టరేట్లోని కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు యాదయ్య తో కలిసి వీసీ లో పాల్గొన్నారు. అదే విధంగా ఆగస్టు 26, 2020 తర్వాత జరిగినటువంటి సెల్ డీడ్స్, గిఫ్ట్ సెటిల్మెంట్స్, పార్టిషన్ డాక్యుమెంట్స్ లలో ప్లాట్ ఓనర్స్ ఉంటే ఇది వారికి చివరి అవకాశం అని చెప్పారు. . జిల్లాలో 48 వేల మంది ఎల్.ఆర్.ఎస్ కొరకు దరఖాస్తు చేసుకున్నారని, కానీ ఇప్పుడు క్రమబద్ధీకరణ చేసుకునేందుకు కేవలం 160 మంది మాత్రమే ముందుకు వచ్చి డబ్బులు చెల్లించడం జరిగిందన్నారు. ఎల్.ఆర్.ఎస్ ఆమోదం లేని ప్లాటు పై ఇల్లు కట్టుకోవాలంటే అప్పటి ప్లాట్ వాల్యూ పై ప్రో రేటా ఫీజు తో పాటు 14 శాతం పెనాల్టీ చెల్లించాల్సి ఉంటుందని తెలియజేశారు. మున్సిపల్ కమిషనర్లు, అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ యాదయ్య, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, సబ్ రిజిస్టర్ చంద్రశేఖర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్లు, టౌన్ ప్లానింగ్ ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు.

# పోసాని కృష్ణ మురళికి బెయిల్ మంజూరు

**టీ మీడియా, మార్చి 7, అమరావతి :**



ప్రముఖ సినీ నటుడు పోసాని కృష్ణమురళికి ఏపీ హైకోర్టులో బెయిల్ మంజూ రైంది. కూటమి నేతలపై గతంలో అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ ఆయనపై కేసును నమోదు అయిన సంగతి తెలిసిందే అయితే విజయవాడ, సూర్యాపేట, పీఎస్ లో నమోదైన కేసులో ఆయనపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని హైకోర్టు శుక్రవారం ఆదేశించింది..ఓబులవారిపల్లె పోలీస్ స్టేషన్ లో నమోదైన కేసులో పోసానికి బెయిల్ మంజూ రు చేసింది.. పోసానిపై విశాఖ, చిత్తూరు జిల్లాల్లో నమోదైన కేసుల్లో తొందరపాటు చర్యలు తీసుకోవద్దని పోలీసులను ఏపీ హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణ వచ్చే సోమవారానికి వాయిదా వేసింది.రాష్ట్రవ్యాప్తంగా తనపై నమోదైన కేసులకు సంబం ధించి క్వాష్ చేయాలంటూ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు పోసాని. తాను ఏదీ తప్పుగా మాట్లాడలేదని, సమాజంలో జరుగుతున్న విషయాలను ప్రస్తావించా నని, తనపై నమోదైన కేసులను క్వాష్ చేయాలని పోసాని కృష్ణమురళి కోర్టుని అభ్యర్థించారు. పోసానిపై రాష్ట్రవ్యాప్తంగా మరో 14 కేసులు ఉన్నాయి.తనపై నమోదైన కేసులను క్వాష్ చేయాలంటూ ఇటీవల హైకోర్టులో పిటిషన్ వేశారు పోసాని. తనపై ముందస్తు చర్యలు తీసుకోకుండా ఆదేశాలు ఇవ్వాలంటూ పిటిషన్ లో పేర్కొన్నారు. పోలీసులు నమోదు చేసిన సెక్షన్లు తనకు వర్తించవని, తదుపరి చర్యలను నిలువరించాలని కోరారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ను దూషించారం టూ పోసానిపై రాష్ట్రంలోని నాలుగు పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదయ్యాయి. వాటిని క్వాష్ చేయాలని పిటిషన్ వేశారు. తనపై రాజకీయ ద్వేషంతోనే తప్పుడు కేసులు పెడుతు న్నారని పిటిషన్ లో పేర్కొన్న పోసాని.. ఆయా కేసుల్లో 41ఏ నోటీసులు వచ్చేలా ఆదేశాలు ఇవ్వాలని కోర్టును కోరారు.

# ఇందిరమ్మ ఇళ్ళకు భూమి పూజ చేసిన ఎమ్మెల్యే

**టీ మీడియా మార్చి 7:ధర్మారం:**



బంజర్ పల్లి బి గ్రామ తండాలో శుక్రవారం ఇందిరమ్మ ఇండ్లకు భూమి పూజ చేసిన ప్రభుత్వ విప్ లక్ష్మణ్ కుమార్.ఈ సందర్బంగా ప్రభుత్వ విప్ లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తూ ముందుకు వెళ్లడం జరుగుతుందని,అందులో భాగంగా పైలెట్ ప్రాజెక్టుగా తీసుకున్న బంజేర్ పల్లి తండ గ్రామంలో 65,ఇందిరమ్మ ఇండ్లకు భూమి పూజ కార్యక్రమం నిర్వహించడం జరిగిందనీ,అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లను కట్టించే బాధ్యత నాదేనని,ఇండ్ల నిర్మాణం విషయంలో కూడా ఎక్కడ కూడ అవినీతికి తావు లేకుండా విడతల వారీగా డబ్బులను నేరుగా లబ్ధిదారుల ఖాతాలో జమ చేయడం జరుగుతుందని. తండాలో ,ఇళ్ల నిర్మాణానికి బోర్ వెల్ అవసరం ఉందని ఇక్కడి నాయకులు గ్రామస్థులు దృష్టికి తీసుకురావడం జరిగిందని,ఏసీడీపీ నిధుల ధ్వారా బోర్వెల్ మంజూరు చేసి 2 రోజుల్లో బోర్ వేయించడం జరుగుతుందని,అలాగే కొంతమంది రైతులకు 2, లక్షల రూపాయల రుణమాఫీ కానీ వారికి రుణమాఫీ చేసి తీరుతామని,సన్న వడ్ల బోనస్ కూడా రైతుల ఖాతాలో జమ చేసే విధంగా చర్యలు తీసుకుంటాన్నామని కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీ లను నెరవేర్చి తీరుతామణి అన్నారు.కార్యక్రమంలో నాయకులు కార్యకర్తలు అధికారులు గ్రామస్థులు పాల్గొన్నారు.

# భర్తను చంపించిన భార్య

**టీ మీడియా, మార్చి 7, వనపర్తి బ్యూరో :**




పాన్గల్ గ్రామంలో ఈ నెల 1న అనుమాన స్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన ఘటన కేసును పానుగల్ పోలీసులు చేదించారు. అందుకు సంబంధించిన వివరాలను శుక్రవారం వనపర్తి సర్కిల్ కార్యాలయంలో వనపర్తి డిఎస్పీ, వెంకటేశ్వర రావు వివరాలు వెల్లడించారు.ఎండి. జాఫర్ ఖాన్ పానగల్ గ్రామానికి చెందిన ఎండీ.పర్వీన్ బేగం ఎం.డి రహమతుల్లాసుమారు 12 నం.. రాల క్రితం కర్నూల్ పట్టణానికి చెందిన ఎండి రహమతుల్లాని,. లో వారిద్దరి మధ్య సంసారం విషయం లో గొడవలు రావటంతో, అందాజ పది సంవత్సరాల క్రితమే భార్య భర్తలు వారి ఇద్దరు పిల్లలతో కలిసి ఆమె తల్లి గ్రామమైన పానగల్ కు వచ్చి సంతబజార్ కు దగ్గరలో కిరాయి ఇంటిలో ఉంటూ జీవనం కొనసాగిస్తున్నారు. భర్త పెయింటింగ్ పని మటన్ కటింగ్ పనిచేస్తు, ఆమె సంతబజార్ నందు ఒక టైలర్ షాప్ లో టైలరింగ్ నేర్చుకొనుచుండగా టైలరింగ్ షాప్ పక్కన వుండే కిరాణం షాపు నడుపుచున్న కుమ్మరి రాఘవేంద్ర వయసు 31 సంవత్సరాలుతో పరిచయమై, వారిద్దరి మధ్య అక్రమ సంబందం ఏర్పడింది. క్రమంలో అందజా ఒక నెల తరువాత పర్వీన్, రాఘవేంద్రలు ఇంటిలో ఉండగా ఆమె భర్త రహమతుల్లా వారిని చూసి పట్టుకొని వారిద్దరిని కొట్టినాడని. అట్టి విషయంలో ఆమె భర్త రహమతుల్ల పానగల్ గ్రామంలో గల పీర్ల చావిడి నందు వారి ఇరువురి కుటుంబ పెద్దల సమక్షంలో పంచాయితీ పెట్టి వారిని మందలించినాడు,రహమతుల్లా తరుచూ ఆమెను చిత్రహింసలు పెడుతు, రాఘవేంద్రతో కూడా గొడవ పెట్టుకొనేవాడు. ఆమె భర్త బ్రతికున్నంత కాలం వారికీ ఇబ్బందులు తప్పవని భావించి, ఎలాగైనా సరే రహమతుల్లా ను చంపమని లేదా ఆమెను ఎక్కడికైనా తీసుకెళ్ళమని రాఘవేంద్ర తో చెప్పగా, రాఘవేంద్ర తనకు పరిచయమున్న కురుమూర్తి తో అట్టి విషయం చెప్పి దానికి గాను కురుమూర్తి రాఘవేంద్ర కు ఇవ్వవలసిన డబ్బులు మాఫీ చేస్తానని చెప్పటంతో కురుమూర్తి కూడా అందుకు ఒప్పుకాగా, అందుకు ఆమె కూడా సరే అని ఒప్పుకున్నాది. వారు అనుకున్న పథకం ప్రకారం హత్యచేసారు.అనుమానం రాకుండా ఉండాలని రహమతుల్లా శవమును అతని వెంట తెచ్చుకున్న కత్తిని పక్కనే ఉన్న కాల్వలో పడేసి,రాఘవేంద్ర కురుమూర్తిలు కలిసి మోటార్ సైకిల్ పై వెళ్లిపోయినారు.



# సీసీ కెమెరాలు ఏర్పాటుకు విరాళాలు

**టీ మీడియా ,మార్చ్ 7, ఆత్మకూర్ :**
వనపర్తి జిల్లా ఆత్మకూరు మండలం మూలమల గ్రామంలో గ్రామ భద్రత పరిరక్షణలో భాగంగా ఒక్క సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానమని మూలమల్ల గ్రామస్తులు సీసీ కెమెరాల ఏర్పాటుకు 50 వేల రూపాయల విరాళాలను సీసీ కెమెరాల ఆపరేటర్ కి అందజేశారు. గ్రామ భద్రత పరిరక్షణకు ప్రతి ఒక్కరు తమ వంతు సహాయంగా సీసీ కెమెరాల ఏర్పాటుకు సహాయ సహకారాలు అందించాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు గడ్డం భీమన్న,ప్రతాప్ రెడ్డి, ఉదుట్ల సురేందర్,వల్లూరి సత్యన్న, రామన్న గౌడ్, శేఖర్, కురుమన శ్రీనివాసులు హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

# తాసిల్దార్ కార్యాలయనికి నిధులు మంజూరు

- ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

**టీ మీడియా, మార్చి 7, వనపర్తి బ్యూరో :**



రేవల్లి మండల తాసిల్దార్ కార్యాలయ నూతన భవన నిర్మాణానికి ప్రభుత్వం 32 లక్షల రూపాయలను మంజూరు చేసింది.వనపర్తి ఎమ్మెల్యే తూడి మెగా రెడ్డి అభ్యర్థన మేరకు స్పందించి రాష్ట్ర రెవెన్యూ శాఖ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి నిధులు మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు.ఈ క్రమంలో శుక్రవారం వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి అందుకు సంబంధించిన ప్రొసీడింగ్ ను జారీ చేశారు.అడిగిన వెంటనే తాసిల్దార్ కార్యాలయం నూతన భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేసి సహకరించిన రాష్ట్ర రెవెన్యూ శాఖ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి ఎమ్మెల్యే ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

# సచివాలయంలో కాంట్రాక్టర్ల ధర్నా

- పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్

**టీ మీడియా, మార్చి 7, హైదరాబాద్ బ్యూరో :**



తమకు చెల్లించాల్సిన పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ సచివాలయంలో ధర్నాకు దిగారు కాంట్రాక్టర్లు.రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కను కలిసేందుకు శుక్రవారం మధ్యాహ్నం సచివాలయానికి వచ్చారు. డిప్యూటీ సీఎంను కలిసేందుకు ఆయన సెక్యూరిటీ సిబ్బందితో పాటు సచివాలయం సెక్యూరిటీ బాధ్యతలు చూసే ఎస్పీఎఫ్ సిబ్బంది ఒప్పుకోలేదు. తమలో కొందరినైనా డిప్యూటీ సీఎంతో కలిపించండి అని వేడుకున్నా సెక్యూరిటీ సిబ్బంది పట్టించుకోలేదు.దీంతో విసుగెత్తిన కాంట్రాక్టర్లు ఆయన చాంబర్ ఎదుట ఆందోళనకు దిగారు.సర్కార్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఎన్నికలకు ముందు హామీ ఇచ్చినట్టుగా వెంటనే పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు. మూడేళ్లుగా తమ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. బడా కాంట్రాక్టర్లకు బిల్లులు ఇచ్చేందుకు డబ్బులు ఉంటాయి కానీ తమకు ఇవ్వడానికి లేవా అని నిలదీశారు. తమ బిల్లులు క్లియర్ చేయడానికి 20 శాతం కమీషన్లు అడుగుతున్నారని.. అంత మొత్తం ఎక్కడి నుంచి తేవాలని ప్రశ్నిస్తున్నారు. అప్పులు తెచ్చి పనులు చేశామని.. వాటికి వడ్డీలు చెల్లించడానికే సతమతమవుతున్న తమకు 20 శాతం కమీషన్లు అడగడం ఏమిటని మండిపడ్డారు. కాంట్రాక్టర్ల ఆందోళనతో డిప్యూటీ సీఎం భట్టి సెక్రటేరియట్ నుంచి వెళ్లపోయారు.

# నూతన కమిషనర్ గా సన్ ప్రీత్ సింగ్

**టీ మీడియా ,మార్చ్ 7, వరంగల్ :**




పోలీస్ కమిషనరేట్ నూతన పోలీస్ కమిషనర్ గా సన్ ప్రీత్ సింగ్ ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారిచేసింది. ప్రస్తుతం సూర్యాపేట జిల్లా ఎస్పీగా విధులు నిర్వహిస్తున్న సన్ ప్రీత్ సింగ్ 2011ఐపిఎస్ బ్యాచ్ కు చెందినవాడు. 2012 సంవత్సరంలో ములుగు ఏ. ఎస్పీ, వరంగల్ రూరల్ ఓ ఎస్ డి గా పని చేశారు. అనంతరం ఎల్.బి నగర్ డిసిపీ గాను, ఎస్పీగా జగిత్యాల్ లో పనిచేశారు. ప్రస్తుతం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా రామగుండం పోలీస్ కమిషనర్ బదిలీ అయినారు.

# పాత బస్టాండ్ పనులను ప్రారంభించిన అధికారులు

- పర్యవేక్షించిన అఖిలపక్ష ఐక్యవేదిక

**టీ మీడియా, మార్చి 7, వనపర్తి బ్యూరో:**



వనపర్తి జిల్లా కేంద్రం లోని పాత బస్టాండ్ పున ప్రారంభించడానికి అధికారులు గుత్తేదారులు పని ప్రారంభించడంతో, దానికోసం మూడు సంవత్సరాలుగా పోరాటం చేసిన అఖిలపక్ష ఐక్యవేదిక నాయకులు అక్కడికి వెళ్లి పనులు పరిశీలించి అధికారులను విషయం అడిగి తెలుసుకున్నారు. ఇన్ని సంవత్సరాల ప్రజల ఇబ్బందులు తొలగిపోతున్నందుకు సంతోష పడుతున్నామని అఖిలపక్ష ఐక్యవేదిక ఎల్లప్పుడూ ప్రజల పక్షాన ఉంటుందని వారికి ఇబ్బంది కలిగినచో అక్కడే పోరాటం మొదలవుతుందని అధ్యక్షుడు సతీష్ యాదవ్ తెలిపారు. ఇందుకు సహకరించిన అధికారులకు ప్రజాప్రతినిధులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నామని అలాగే అక్కడ 40 సంవత్సరాల నుండి చిరు వ్యాపారం చేసుకున్న వారికి కూడా సౌకర్యాలు కల్పించాలని వారికి తగు రక్షణ కల్పించాలని ఐక్యవేదిక డిమాండ్ చేస్తుంది అన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు సతీష్ యాదవ్ తో పాటు రాష్ట్ర టిడిపి నాయకులు కొత్తగొల్ల శంకర్, కాంగ్రెస్ నాయకులు వెంకటేశ్వర్లు, గౌనికాడి యాదయ్య, బొడ్డుపల్లి సతీష్, శివకుమార్, పుట్టపాక బాలు రాజేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# ఐక్యవేదిక సభ్యులను అభినందించిన మాజీ ఎమ్మెల్యే జయరాములు కుటుంబం

**టీ మీడియా, మార్చి 7, వనపర్తి బ్యూరో :**



అఖిలపక్ష ఐక్యవేదిక అధ్యక్షుడు సతీష్ యాదవ్ ఇంటికి వచ్చి ఐక్యవేదిక సభ్యులను అభినందించిన మాజీ ఎమ్మెల్యే జయరాములు కుటుంబం.మరుగున పడ్డ బీసీ మాజీ ఎమ్మెల్యేలను వెలుగులోకి తెచ్చిన సందర్భాన్ని గుర్తు చేస్తూ జయరాములు కూతురు భరణి మాట్లాడుతూ 40 సంవత్సరాలుగా వనపర్తికి దూరంగా ఉన్న మేము కూడా పట్టించుకోని మా నాన్న పేరు గానీ, డాక్టర్ బాలకృష్ణయ్య పేరుగాని, అయ్యప్ప పేరుగాని, మిగతా ఎమ్మెల్యే పేర్లు వెలుగులోకి తేచ్చిన ఐక్యవేదిక నాయకులను మనస్ఫూర్తిగా మా కుటుంబం తరఫున అభినందనలు ధన్యవాదాలు తెలుపుతున్నామని తెలిపారు. అలాగే సిఎం మీటింగ్ లో ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ మా నాన్న పేరు పెట్టడాన్ని, హాస్పిటల్ కు డాక్టర్ బాలకృష్ణయ్య పేరు పెట్టడాన్ని స్వాగతిస్తున్నామని, ప్రతిపాదించిన ఎమ్మెల్యే తూడిమేగా రెడ్డికి, తెలంగాణ ముఖ్యమంత్రికి, అఖిలపక్ష ఐక్యవేదిక అధ్యక్షుడు సతీష్ యాదవ్ కి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నామని ఆమె తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు కూతుర్లు అరుణ, రోహిణి, భరణి, కుమారుడు వశిష్ట, అల్లుళ్ళు రంగస్వామి అలాగే ఎస్పీ పార్టీ రాష్ట్ర కార్యదర్శి బాబు గౌడ్, ఐక్యవేదిక సభ్యులు వెంకటేశ్వర్లు, కొత్త గోళ్ళ శంకర్,గౌని కాడి యాదయ్య, విజేత రాములు, నరసింహ, తేజ వర్ధన్ యాదవ్, దేశి తిమ్మన్న, బొడ్డుపల్లి సతీష్,శివకుమార్, బాలు, రాజేష్ యాదవ్, రాములు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# మెరుగైన వైద్యం కోసం ఎల్ఓసిలు అందజేసిన చిన్నారెడ్డి

**టీ మీడియా, మార్చి 7, వనపర్తి బ్యూరో :**



ఖిల్లా ఘణపురం మండలం మహమ్మద్ హుస్సేన్ పల్లి గ్రామానికి చెందిన డి. బాల కిష్టమ్మ , కె. వర్షిని అనారోగ్యం తో నిమ్స్ హాస్పిటల్లో జాయిన్ కావడం జరిగింది. బాలకిష్టమ్మ కు 2,50,000/- విలువగల ఎల్ ఓ సి ని వర్షిని కి 2,00,000/- విలువగల ఎల్ఓసి పత్రాన్నిరాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి అందజేయడం జరిగింది. ప్రత్యేక చొరవతో చిన్నారెడ్డి ఎల్ ఓ సి పత్రాలను అందజేసినందుకు బాలకిష్టమ్మ , వర్షిని కుటుంబ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాజేంద్ర ప్రసాద్ యాదవ్ , వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కన్వీనర్ దేవన్న యాదవ్, పెద్దమందడి మండల్ కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ అధ్యక్షుడు రఘు, యూత్ కాంగ్రెస్ నాయకులు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# మహిళలు అన్ని రంగాల్లో ప్రగతి సాధించాలి

- పలుస శంకర్ గౌడ్

**టీ మీడియా, మార్చి 7, వనపర్తి బ్యూరో :**



మహిళలు తమకు ఆసక్తి గల అన్ని రంగాల్లో ప్రగతి సాధించాలనీ సాహితీ కళా వేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్ గౌడ్ అన్నారు.అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం జిల్లా విద్యాశాఖలో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులను వారి కార్యాలయంలో సాహితీ కళా వేదిక ప్రతినిధులు ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా శంకర్ గౌడ్ మాట్లాడుతూ ఒకనాడు ఇంటి పనికి వ్యవసాయ పనులకు మాత్రమే పరిమితమైన స్త్రీలు నేడు విద్య వైద్య వైజ్ఞానిక రాజకీయ రంగాలలో తమ ప్రతిభను చాటుతున్నారని పేర్కొన్నారు.అయితే సమాజంలో స్త్రీలు వివక్షతోపాటు అసాంఘిక దాడులకు గురికావడం బాధాకరంగా ఉందని ఆయన వివరించారు. అనంతరం జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో పని చేస్తున్న జిసిడిఓ శుభలక్ష్మి,మౌనిక రజిత లక్ష్మీదేవమ్మ లను వేదిక సభ్యులు శాలువా జ్ఞాపికలతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో డిసిఇబి జిల్లా సెక్రెటరీ సూర చంద్ర శేఖర్, ఎసిజిఇ గణేష్ కుమార్, ఆఫీస్ సూపరింటెండెంట్ వీరశేఖర్ వైయస్ ఓ సుధీర్ కుమార్ రెడ్డి,ఎస్ జిఎఫ్ సెక్రెటరీ సురేందర్ రెడ్డి, బైరోజు చంద్ర శేఖర్,శ్రీధర్ రెడ్డి,శ్రీపాద అన్సారి శేఖర్, యుగంధర్ శ్రీధర్, ఖదీర్, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



# శారీరక దృడత్వానికి క్రీడలు ఎంతో అవసరం

- జిల్లా ఎస్పీ రావుల గిరిధర్

**టీ మీడియా, మార్చి 7, వనపర్తి బ్యూరో :**
వనపర్తి జిల్లా కేంద్రంలోని సిల్వర్ జూబ్లీ క్లబ్ వనపర్తి వారి ఆధ్వర్యంలో స్వర్గీయ నారమ్మ నర్సిరెడ్డి, బాదం పాండురంగయ్య స్మారక పురుషుల ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లాస్థాయి షటిల్ బ్యాడ్మింటన్ పోటీలకు మా సిల్వర్ జూబ్లీ క్లబ్ సభ్యుల నిర్వహించిన షటిల్ బ్యాడ్మింటన్ క్రీడలకు ముఖ్య అతిథిగా జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి క్రీడలను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ముందుగా క్రీడల్లో ఉత్సహంగా పాల్గోన్న క్రీడాకారులతో పాటు, క్రీడల నిర్వహకులకు ఎస్పీ అభినందనలు తెలిపారు. క్రీడలలో పాల్గొనడం ఎంతో స్ఫూర్తి దాయకమని ప్రతి ఒక్కరు క్రీడలను ఆడుతూ మనసిక, శారీరక దృఢత్వాన్ని కాపాడుకోవాలని తెలియజేశారు. క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని మీరు ఈ క్రీడల ద్వారా మీ శారీరక దారుడ్యం మెరుగుపడటంతో పాటు, పనిఒత్తిళ్ళను అధిగమించి ఆరోగ్యంగా వుంటారని ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో వనపర్తి సీఐ కృష్ణ, సిల్వర్ జూబ్లీ క్లబ్ అధ్యక్షుడు, ఎం.సత్యశీలా రెడ్డి, సెక్రెటరీ ఎన్ కృష్ణారెడ్డి, వైస్ ప్రెసిడెంట్, దామోదర్ రెడ్డి, జాయింట్ సెక్రెటరీ,ఏ రమేష్, ట్రెజరర్, బి నరసింహ, గేమ్ సెక్రెటరీ, ఎస్ మోహన్ రెడ్డి, ఎంసీ నెంబర్లు, తిమ్మారెడ్డి, రవీందర్, ఎం శ్రీనివాసులు, సిల్వర్ జూబ్లీ క్లబ్ సభ్యులు క్రీడాకారులు పాల్గొన్నారు.

# గుర్తుతెలియని మృతదేహం లభ్యం

**టీ మీడియా ,మార్చి7,ధర్మపురి:**
మండలం రాయపట్నం లోని గోదావరి నదిలో గుర్తు తెలియని శవం నదిలో తెలియడుతూండగా అక్కడ వున్నా జాలర్లు గుర్తించి పోలీస్ లకు సమాచారం అందించగా ఎస్సై ఉదయ్ కుమార్ వెంటనే స్పందించి అక్కడికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించగా గుర్తుపట్టకుండా శవం ఉందని మృతుని దగ్గర సంబంధిత ఆధారాలకోసం ప్రయత్నం చేయగా ఎటువంటి ఆధారాలు లభించలేదని, మృతుని వయసు సుమారు 35,నుండి 40 సంవత్సరాల వయసు ఉంటుందని ఫోటో ఆధారంగా మృతున్ని ఎవరయినా గుర్తించి నా యెడల 8712656824,ఈ నెంబర్ కి ఫోన్ చేయాలనీ.ఎస్సై ఉదయ్ కుమార్ తెలిపారు.

# డబల్ బెడ్ రూమ్ ఇండ్లకు మహర్దశ

- శాసనసభ్యులు మేఘారెడ్డి

**టీ మీడియా, మార్చి 7, వనపర్తి బ్యూరో :**



వనపర్తి నియోజకవర్గ పరిధిలోని వివిధ మండలాలలో నిర్మించిన డబల్ బెడ్ రూమ్ ఇండ్లకు మహర్దశ చేకూరినట్లు వనపర్తి శాసనసభ్యులు మేఘారెడ్డి పేర్కొన్నారు.గత పదేళ్ల పాలనలో బీఆర్ఎస్ ప్రభుత్వం డబల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణం చేపట్టి ప్రభుత్వ ధనాన్ని వృధా చేసిందే తప్ప నిరుపేదలకు కేటాయించిన ఇండ్ల నాణ్యతలో మౌలిక సదుపాయాల కల్పనలో ఎలాంటి చర్యలు చేపట్టలేదన్నారు.నిరుపేదల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని డబల్ బెడ్ రూమ్ ఇళ్లలో, విద్యుద్దీకరణ, తాగునీటి సమస్య, మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టాలని కోరుతూ వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘా రెడ్డి రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కి నివేదించిన అభ్యర్థన మేరకు స్పందించిన మంత్రి వనపర్తి నియోజకవర్గ పరిధిలో వివిధ ప్రాంతాల్లో నిర్మించిన 909 డబల్ బెడ్ రూమ్ ఇండ్లకు గాను 4,66,94, 283కోట్ల రూపాయలను మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు.ఖిల్లా ఘణపురం మండలంలోనిగార్లబండ తండా కు చెందిన 20 డబల్ బెడ్ రూమ్ లకు,కర్నే తండా షాపూర్ కు చెందిన 5 డబల్ బెడ్ రూమ్ లకు,కోతులకుంట తండాకు చెందిన 24 డబల్ బెడ్ రూమ్ లకు, మామిడిమాడ గ్రామానికి చెందిన 40 డబల్ బెడ్ రూములకు,ముందరితండాకు చెందిన 15 డబుల్ బెడ్ రూమ్ లకు,సల్కేలాపురం గ్రామానికి చెందిన 50 డబుల్ బెడ్ రూమ్ లకు,తిరుమలాయపల్లి గ్రామానికి చెందిన 20 డబల్ బెడ్ రూమ్ లకు, పెబ్బేరు మండలం గుమ్మడం గ్రామానికి చెందిన 100 డబుల్ బెడ్ రూమ్ లకు,పెబ్బేరు కు చెందిన 24 డబల్ బెడ్ రూమ్ లకు,పెద్దమందడి మండలం బుగ్గ పల్లి తండా కు చెందిన 17 డబల్ బెడ్ రూమ్ లకు,వనపర్తి పీర్లగుట్టకు చెందిన 144 డబల్ బెడ్ రూమ్ లకు,పీర్లగుట్టకు చెందిన 150 డబుల్ బెడ్ రూమ్ లకు,వనపర్తి రాజపేటకు చెందిన 96 డబల్ బెడ్ రూమ్ లకు,వనపర్తి మండలం చిట్యాల కు చెందిన 294 డబులు బెడ్ రూమ్ లకు నిధులు మంజూరయ్యాయని ఇందుకు సంబంధించిన పనులను వెంటనే చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు.అడిగిన వెంటనే స్పందిస్తూ నిధులు మంజూరు చేసిన రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి కృతజ్ఞతలు తెలియజేశారు.

# 21 మంది ఐపీఎస్ అధికారుల బదిలీ

**టీ మీడియా, మార్చి 7, హైదరాబాద్ :**




తెలంగాణలో మళ్లీ ఐపీఎస్ అధికారుల బదిలీలు జరిగాయి. తాజాగా 21 మంది ఐపీఎస్‌లను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఒక అడిషనల్ డీజీ, ఇద్దరు ఐజీపీలు, ఇద్దరు డీఐజీలు బదిలీలు అయ్యారు. అదనపు డీజీ(పర్సనల్)గా అనిల్ కుమార్, ఎస్పీఎఫ్ డైరెక్టర్‌గా అనిల్ కుమార్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు.సీఐడీ ఐజీగా ఎం శ్రీనివాసులు, రామగుండం సీపీగా అంబర్ కిశోర్ ఝా, వరంగల్ సీపీగా సన్‌ప్రీత్ సింగ్, ఇంటెలిజెన్స్ ఎస్పీగా సింధూశర్మ, మహిళా భద్రత విభాగం ఎస్పీగా చేతన, నార్కోటిక్ బ్యూరో ఎస్పీగా రూపేశ్, కామారెడ్డి ఎస్పీగా రాజేశ్ చంద్ర, నిజామాబాద్ సీపీగా సాయిచైతన్య, సంగారెడ్డి ఎస్పీగా పారితోష్ పంకజ్, కరీంనగర్ ఎస్పీగా గౌస్ ఆలం, ఆదిలాబాద్ ఎస్పీగా అఖిల్ మహాజన్, యాదాద్రి భువనగిరి డీసీపీగా ఆక్షాన్స్ యాదవ్, రాజన్న సిరిసిల్ల ఎస్పీగా మహేశ్ బాబాసాహెబ్, మంచిర్యాల డీసీపీగా ఏ భాస్కర్, సూర్యాపేట ఎస్పీగా నరసింహ, హైదరాబాద్ సెంట్రల్ జోన్ డీసీపీగా శిల్పవల్లి, ఎస్ఐబీ ఇంటెలిజెన్స్ ఎస్పీగా సాయి శేఖర్, పెద్దపల్లి డీసీపీగా కరుణాకర్, సీఐడీ ఎస్పీగా రవీందర్ బదిలీ అయ్యారు.

# జోగులాంబ ఆలయ అభివృద్ధికి ప్రణాళిక

- డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి

**టీ మీడియా, మార్చి 7, వనపర్తి బ్యూరో :**



ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా జోగులాంబ ఆలయ అభివృద్ధి కోసం ప్రత్యేక ప్రణాళికను రూపొందించి ముందుకు సాగాలని, తక్షణ పనుల కోసం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలని ఎండోమెంట్స్ శాఖ ఉన్నత స్థాయి సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. శుక్రవారం ప్రజా భవన్ లో జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి , ఎండోమెంట్స్ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్ , కమిషనర్ శ్రీధర్ , ఆలయ కమిటీ చైర్మన్ నాగేశ్వర్ రెడ్డి , వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ జడ్పీటీసీ రాజేంద్ర ప్రసాద్ యాదవ్ , ఆగమా శాస్త్ర పండితులు గోవింద హరి , తదితరులు పాల్గొన్నారు. జోగులాంబ ఆలయ సమగ్ర అభివృద్ధికి తాత్కాలిక పనులు, దీర్ఘ కాలిక పనుల జాబితాను సిద్ధం చేయాలని సమావేశంలో నిర్ణయించారు.

ఈనెల 20 వ తేదీ నాటికి తాత్కాలిక, తక్షణ పనులను ఎంపిక చేసి నివేదిక అందజేయాలని కమిటీకి కాల పరిమితిని నిర్ణయించారు. తాత్కాలిక పనులలో భాగంగా ఆలయ ప్రాంగణంలో లైటింగ్, పార్కింగ్, ఆలయ చరిత్రతో ప్రచార బోర్డులు పెట్టాలని, అందుకు బస్సు స్టాండ్స్, రైల్వే స్టేషన్స్, ముఖ్య ప్రదేశాలను ఎంపిక చేయాలని నిర్ణయించారు. దీర్ఘ కాలిక పనులలో బోటింగ్, టూరిజం అభివృద్ధి, అతిథి గృహాల నిర్మాణాలు, ఎవెన్యూ ప్లాంటేషన్, ఆర్చిల ఏర్పాటు వంటి పనులు చేపట్టాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా చిన్నారెడ్డి పలు సూచనలు చేశారు. అత్యంత ప్రాధాన్యతతో పనులు చేపట్టాలని, లక్ష్యం మేరకు ముందుకు సాగాలని చిన్నారెడ్డి అన్నారు. ఈ సమావేశంలో సూర్యనారాయణ మూర్తి పవర్ పాయింట్ ప్రెసెంటేషన్ ఇచ్చారు. ఎండోమెంట్స్ జాయింట్ కమిషనర్ రామకృష్ణ , ఆలయ అధికారులు పాల్గొన్నారు.



# కెడావర్ డాగ్స్ ఆన్ డ్యూటీ

- మామూలు పోలీస్ డాగ్స్ కావవి
- నేరపరిశోధనలో మెరుగైన ఫలితాలు

**టీ మీడియా, మార్చి 7, హైదరాబాద్ బ్యూరో :**



డాగ్ అంటే డాగ్ కాదు. వాటి పర్ఫామెన్స్ చూస్తే ఓ మై డాగ్ అనాల్సిందే. %ూాదీజ% సొరంగమార్గంలో రెస్క్యూ ఆపరేషన్‌కోసం ఇప్పటికే దేశవ్యాప్తంగా వివిధ విభాగాలు, నిపుణుల బృందాలు రంగంలోకి దిగాయి. ఇలాంటి విపత్తుల్లో అపార అనుభవమున్న ఎక్స్‌పర్ట్స్ రెండువారాలుగా శ్రమిస్తున్నారు. టన్నెల్ రెస్క్యూ ఆపరేషన్ మహామహులకే అగ్నిపరీక్ష పెడుతున్న సమయంలో హెలికాప్టర్‌లో వాలిపోయింది మరో స్పెషల్ టీమ్.

ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో గల్లంతైన ఎనిమిదిమంది జాడ కోసం రంగంలోకి దిగాయి రెండు కెడావర్ డాగ్స్. క్రైమ్ స్పాట్‌కి సాధారణంగా వచ్చే మామూలు పోలీస్ డాగ్స్ కావవి. స్పెషల్లీ ట్రైన్డ్ డాగ్స్. వయనాడ్ వరద విపత్తులో రెస్క్యూ బృందాలు గుర్తించలేకపోయిన మృతదేహాల ఆనవాళ్లను కూడా సునాయాసంగా పసిగట్టిన పవర్‌ఫుల్ డాగ్స్. కెడావర్ డాగ్స్ ఇన్వెస్టిగేషన్ రూటే సెపరేటు. ప్రమాదాల సమయంలో శిథిలాల కింద.. మనుషులు బతికున్నా, నిర్జీవంగా ఉన్నా కనిపెట్టగల సామర్థ్యం వీటి సొంతం. 15 అడుగుల కింద ఉన్నా గుర్తించగల కెపాసిటీ కెడావర్ డాగ్స్‌కి ఉంది. ప్రతికూల పరిస్థితుల్లోనైనా.. తేలిగ్గా వాసనను పసికట్టగలగడం ఈ కెడావర్ డాగ్స్ ప్రత్యేకత. నేరపరిశోధనలో చాలాసందర్భాల్లో వీటితో మెరుగైన ఫలితాలు సాధించాయి దర్యాప్తు బృందాలు. కేరళ వయనాడ్ విపత్తుల్లోనూ ఇవి విశేష సేవలు అందించాయి. వయనాడ్ వరదల సమయంలో బురదలో కూరుకుపోయిన మృతదేహాలను గుర్తించడంలో కీలకంగా వ్యవహరించాయి కెడావర్ డాగ్స్. అతి సూక్ష్మ శబ్దాల్ని కూడా పసిగట్టగలిగే శక్తి కెడావర్ డాగ్స్‌కు ఉంది. అందుకే ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో కెడావర్ డాగ్స్‌తో సెర్చ్ ఆపరేషన్ నిర్వహిస్తోంది కేరళ టీమ్. విపత్తుల సమయంలో శిథిలాల కింద చిక్కుకున్న అనేకమందిని ఈ డాగ్స్ గుర్తించాయి. కేరళే కాదు.. ప్రపంచవ్యాప్తంగా స్పెషల్ ఇన్వెస్టిగేషన్‌లో కెడావర్ డాగ్స్ సంచలన కేసుల్ని శోధించాయి. మనుషులు, జంతువుల కుళ్లిన శరీర అవశేషాలను ఈ జాతి కుక్కలు అవలీలగా గుర్తిస్తాయి. ప్రకృతి వైపరీత్యాలు జరిగిన ప్రాంతాల్లో రెస్క్యూ ఆపరేషన్స్ కోసం కెడావర్ డాగ్స్ సేవలను వినియోగిస్తారు. సాధారణ డాగ్స్ కంటే కెడావర్ జాతి భిన్నమైంది. మనిషికి 40 రకాల వాసనలను గుర్తించే శక్తి ఉంటే, కుక్కలకు ఆ శక్తి 40 రెట్లు ఎక్కువగా ఉంటుంది. బెల్జియన్ మాలినోయిస్ బ్రీడ్‌కు చెందిన కెడావర్ జాతి కుక్కలకు ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు ఉంది. డీకంపోజ్ అయిన మానవ శరీరాల వాసనలను గుర్తించేలా వీటికి శిక్షణ ఇస్తారు. ప్రపంచంలోని అనేక దేశాల్లో ఈ జాతి కుక్కల సేవలను దర్యాప్తు సంస్థలు వినియోగించుకుంటున్నా.. భారత్‌లో కేరళ పోలీసులు వీటిని వినియోగించుకోవడంలో ముందున్నారు. మృతదేహాలను గుర్తించడంలో కేరళలో మాయ, మర్ఫీ అనే రెండు కెడావర్ పోలీస్ డాగ్స్‌కి మంచి పేరుంది. భూమిపైనే కాదు.. నీటిలో ఉన్న మృతదేహాల వాసనలను, మనుషుల అవశేషాలను కూడా పసిగట్టడం కెడావర్ డాగ్స్ స్పెషాలిటీ. శిక్షణ పొందిన శునకాలు 15 అడుగుల లోతు వరకు ఖననం చేసిన శరీరాలతో సహా కుళ్లినదేహాల వాసనని పసిగట్టటంలో 95 శాతం రిజల్ట్ సాధించినట్లు రికార్డులు చెబుతున్నాయి. గల్లంతైనవారి జాడ తెలుసుకోవడంలో ఎన్నో సందర్భాల్లో కెడావార్ జాతి కుక్కలు పోలీసుల దర్యాప్తులో కీలకంగా వ్యవహరించాయి. వాటిని ఇలాంటి సేవలకు వినియోగించుకోవడానికి ముందు సుమారు వెయ్యి గంటల స్పెషల్ ట్రైనింగ్ ఇస్తారు. జంతువులు, మానవుల అవశేషాల మధ్య తేడాని సునాయాసంగా గుర్తించడం కెడావర్ డాగ్స్‌కున్న ప్రత్యేకత. ఖననం చేసినా, ఎక్కడైనా కనిపించకుండా దాచినా, నీటి అడుగున ఉన్నా భిన్నమైన వాతావరణాల్లో, దట్టమైన పొదల్లో, చిత్తడి ప్రాంతాల్లో కూడా పనిచేసేలా కెడావర్ డాగ్స్‌కి శిక్షణ ఇస్తారు. తప్పిపోయిన వ్యక్తులను కనిపెట్టడంలో, హత్యకేసుల దర్యాప్తుల్లో, ప్రకృతి వైపరీత్యాలు, ఏవైనా ప్రమాదాలు జరిగిన సందర్భాల్లో ఈ జాతిరకం కుక్కలు ఎంతో కీలకంగా పనిచేస్తాయి. డ్రగ్స్, బాంబ్స్, వివిధ రకాల వస్తువుల నుంచి వచ్చే వాసనలను మామూలు కుక్కలు పసిగట్టగలుగుతాయి. ప్రత్యేకంగా మృతదేహాలను గుర్తించడంలో నైపుణ్యం ఉన్న కెడావర్ డ్రగ్స్ మాత్రమే మృతదేహాలను, వాటి అవశేషాలను పసిగట్టగలుగుతాయి. ఇన్ని ప్రత్యేకతలుండబట్టే ఎస్ఎల్‌బీసీ టన్నెల్ రెస్క్యూ ఆపరేషన్‌కోసం అంత నమ్మకంగా వాటిని ఆకాశమార్గంలో తీసుకొచ్చారు. %ూాదీజ% టన్నెల్ రెస్క్యూ ఆపరేషన్‌లో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఘటనాస్థలంలో మూడు స్పాట్స్‌ను కెడావర్ డాగ్స్ టీమ్ గుర్తించింది. మార్కింగ్ చేసిన ఆ మూడు ప్రాంతాల్లో రెస్క్యూ టీమ్‌లు తవ్వకాలు చేపట్టడం ఆసక్తి రేపుతోంది.

## అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు

**టి మీడియా ,మార్చి 7 ,మక్తల్ :**



అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా నారాయణపేట జిల్లా కేంద్రంలో స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ లో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా జిల్లా కలెక్టర్ శ్రీమతి సిక్తా పట్నాయక్ గారు, మక్తల్ ఎమ్మెల్యే డా.వాకిటి శ్రీహరి మరియు జిల్లా మహిళా ప్రభుత్వ అధికారులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, అంతర్జాతీయ మహిళా దినోత్సవం శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం మహిళలకు ప్రశంస పత్రాలను అందించారు. పోటీల్లో గెలుపొందిన మహిళలకు శీల్డులను అందించారు. అనంతరం మహిళలను శాలువాతో సత్కరించారు.

## పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించవద్దు

**టి మీడియా, మార్చి 7, పినపాక ప్రతినిధి:**



రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా వాహనాలలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించవద్దని ఏడూళ్ల బయ్యారం ఎస్సై రాజకుమార్ సూచించారు. శుక్రవారం పినపాక మండల పరిధిలోని సీతారాంపురం గ్రామం వద్ద ఎస్సై రాజకుమార్ ఆదేశాలతో పోలీస్ సిబ్బంది వాహన తనిఖీలు చేపట్టారు. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసి వాహనాలకు సంబంధించిన ధ్రువపత్రాలను పరిశీలించారు. తనిఖీలో భాగంగా వ్యవసాయ కూలీలను తరలిస్తున్న ట్రాలీ ఆటోలను ఆపి పరిమితికి మించి కూలీలను ఎక్కించవద్దని హెచ్చరించారు. పరిమితిని మించి కూలీలను వాహనాలలో తరలించినట్లయితే వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. వాహనాల వెనుక తప్పనిసరిగా రేడియం స్టిక్కర్ ఉండాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం వలన రోడ్డు ప్రమాదం జరిగి ప్రాణాలు సైతం పోగొట్టుకోవడం జరుగుతుందిఅన్నారు. ఆటోలలో పరిమితి మించి ప్రయాణికులను ఎక్కించుకోవద్దని వాహనాలతో పాటు ఇన్సూరెన్స్,లైసెన్స్ కలిగి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



## వివాహ వేడుకలో ఎంపీ గడ్డం వంశీకృష్ణ

**టీ మీడియా, మార్చి 6, పెద్దపల్లి బ్యూరో :**

పెద్దపల్లి జిల్లా కాల్వ శ్రీరాంపూర్లో వివేక్ వెంకటస్వామి అనుచరుడు (కాకా) అభిమాని భీమోజుల తిరుపతి చారి కుమార్తె వివాహానికి హాజరైన పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీకృష్ణ నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఎంపీ నూతన జంటకు సుఖసంతోషాలతో సిరిసంపదలు కలగాలని ఆకాంక్షిస్తూ, కుటుంబ సభ్యులతో, శ్రీను, వెంకటేష్, ప్రశాంత్, వినయ్, సతీష్,తిరుపతి,తదితరుల పాల్గొన్నారు.




## ఇందిరమ్మ ఇల్లు భూమి పూజ

**టీ మీడియా, మార్చి 7 ,ఆత్మకూరు:**

ఆత్మకూరు మండల పరిధిలోని దేవరపల్లి గ్రామం లో ఇందిరమ్మ ఇళ్లు లబ్ది దారుడు హన్మంతు భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్న ఆత్మకూరు టౌన్,మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు. ఈ కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షులు రహమతుల్లా అన్నగారు టౌన్ ప్రెసిడెంట్ నల్లగొండ శీను మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ప్రతి లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇల్లు లిస్ట్ ప్రకారంగా వస్తుందని దీని కొరకు కృషిచేసిన మా ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి గారికి ధన్యవాదాలు తెలుపుతున్నాం. మాజీ నియోజకవర్గ యువజన అధ్యక్షులు తులసి రాజ్ యాదవ్ టౌన్ ప్రెసిడెంట్ నల్గొండ శ్రీనివాసులు వెంకటేష్,అన్వర్ పాష, వెంకటన్న, కురుమన్న , సతీష్ మరియు దేవరపల్లి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవం

**టీ మీడియా, మార్చి 7, వనపర్తి బ్యూరో :**



ఎంపియపిఎస్ తాటిపాములలో శుక్రవారం ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం జరిగింది. ఇందులో ఉపాధ్యాయ విద్యార్థులు 20 మంది పాల్గొనడం జరిగింది. డిఈఓ గా భాగ్యలక్ష్మి, ఎంఈఓ గా రాజ్యలక్ష్మి, ప్రధానోపాధ్యాయులుగా పునీత్ కుమార్ ఏఏపిసి చైర్మన్ గా కళ్యాణి ఉపాధ్యాయులుగా 16 మంది ఇద్దరు పిఈటీ

# డీలిమిటేషన్‌కు వ్యతిరేకంగా స్టాలిన్ పోరు

- 7 రాష్ట్రాల సీఎంలకు లేఖ

**టి మీడియా, మార్చి7,చెన్నై:**



లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనను 1971 జనాభా లెక్కల ఆధారంగా చేపట్టాలని డిమాండ్ చేస్తోన్న తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్ కేంద్రానికి వ్యతిరేకంగా పోరాటం తీవ్రం చేశారు. ఇతర రాష్ట్రాల మద్దతు కూడగట్టేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. తమతో కలిసి రావాలని 7 రాష్ట్రాల సీఎంలకు స్టాలిన్ కోరారు. ఈ మేరకు వారికి లేఖలు రాసినట్లు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డితో సహా కేరళ, కర్ణాటక, బంగాల్, పంజాబ్, ఒడిశా ముఖ్యమంత్రులకు స్టాలిన్ లేఖ రాశారు. డీలిమిటేషన్ కసరత్తుకు వ్యతిరేకంగా జాయింట్ యాక్షన్ కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు స్టాలిన్ ప్రకటించారు. స్టాలిన్ ఈ నెల 22న చెన్నైలో జరిగే తొలి సమావేశానికి హాజరుకావాలని 7 రాష్ట్రాల సీఎంలను ఆహ్వానించారు. కేంద్రపాలిత ప్రాంతమైన పుదుచ్చేరి సీఎంకు కూడా ఆహ్వానం పంపారు. ఇంకా జనసేన, బీఆర్ఎస్, వైసీపీతోపాటు ఆయా రాష్ట్రాల్లోని మిగితా రాజకీయ పార్టీలను కూడా జేఏసీ భేటీకి ఆహ్వానించారు. ఇటీవల జరిగిన అఖిలపక్షంలో చేసిన తీర్మానం ఆధారంగా లేఖలు రాసినట్లు స్టాలిన్ చెప్పారు.

**రాజకీయాలకు అతీతంగా**

రాజకీయాలకు అతీతంగా ప్రజల భవిష్యత్తు రక్షకులుగా కలిసి నిలబడదామని స్టాలిన్ పిలుపునిచ్చారు. డీలిమిటేషన్ అనేది సమాఖ్యవాదంపై కేంద్రం చేస్తున్న దాడిగా అభివర్ణించారు. దేశహితం కోసం జనాభా నియంత్రణను పాటించిన రాష్ట్రాలకు పార్లమెంటులో హక్కులు లేకుండా చేస్తున్నారని ఆరోపించారు. ప్రజాస్వామ్యానికి జరుగుతున్న అన్యాయాన్ని తాము అనుమతించవద్దని స్టాలిన్ కోరారు. జేఏసీ ఫర్ డీలిమిటేషన్ అనే హ్యాష్‌ట్యాగ్‌ను ఎక్స్‌లో పంచుకున్నారు. లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన 2026లో జరగనుంది. దీనిని 2 విధాలుగా చేపట్టే అవకాశాలు ఉన్నాయని చెప్పారు. ఒకటి ప్రస్తుతం ఉన్న 543 సీట్లను రాష్ట్రాల మధ్య పునఃపంపిణీ చేయవచ్చనని, రెండోది మొత్తం సీట్ల సంఖ్యను 800కి పెంచవచ్చని తెలిపారు. ఈ రెండు సందర్భాల్లోనూ ప్రస్తుత జనాభా ఆధారంగా లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన చేపడితే తమిళనాడు సహా దక్షిణాది రాష్ట్రాలు తీవ్రంగా నష్టపోతాయన్నారు. 1971 జనాభా లెక్కల ఆధారంగా లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన చేపట్టి 30ఏళ్లపాటు అమల్లో ఉంచాలని స్టాలిన్ డిమాండ్ చేశారు.



## ఘనంగా మహిళా దినోత్సవం

### ముఖ్య అతిథిగా హాజరైన తహసిల్దార్, డిప్యూటీ తహసిల్దార్

**టి మీడియా,మార్చి 7,బెల్లంపల్లి:** బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ మరియు పీజీ కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ముందస్తుగా శుక్రవారం నాడు ఘనంగా నిర్వహించారు.


ప్రిన్సిపల్ డాక్టర్ కాంపల్లి శంకర్ ఆధ్వర్యంలోఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. డిగ్రీ కళా శాల వివిధ విభాగాలలో మరిన్ని వనరులు సమ కూర్చు కోవలసిన ఆవశ్య కత గురించి ప్రిన్సిపాల్ వివరించారు. తహశీల్దార్ జోష్న మాట్లా డుతూ, మహిళా విద్యార్థు లకు మరియు మహిళ అధ్యాపకులందరికీ అంతర్జాతీయ మహిళా దినోత్సవశుభాకాంక్షలు తెలియజేశారు. సమాజం లోని అన్ని రంగాల అభివృద్ధిలో మహిళలు అత్యంత కీలకమని, అన్నారు. బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదువుతున్న వారిలో విద్యార్థులు ముం దున్నారని కొనియాడారు. అదేవిధంగా మహిళ అధ్యా పకులు సైతం కళాశాల విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నారని తెలిపారు.

**ఆలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు**

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరిం చుకొని పాడిన పాటలు అలరించాయి. ఆలోచింప జేశాయి. పలువురు విద్యా ర్థులు, వక్తలు మాట్లాడిన మాటలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కాంపల్లి శంకర్, తహశీల్దార్ జోత్న్న, డిప్యూటీ తహసిల్దార్ కల్పన, కళాశాల ఉమెన్ ఎంపవర్మెంట్ కోఆర్డినేటర్ ఎం ఏ రేష్మ, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

## నేడు పెరేడ్ గ్రౌండ్ వేదికగా -అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు

**టి మీడియా,మార్చి 7,హైదరాబాద్:**



అంతర్జాతీయ మహిళా దినోత్సవం ప్రపంచ వ్యాప్తం గా ఉన్న మహిళలను గౌరవించే దినోత్సవం. ప్రతి మగవాడి విజయం వెనక ఒక తల్లి, భార్య,చెల్లి అక్క కూతురు,ఇలా ఒక స్త్రీ మూర్తి ఉండే ఉంటారు. వారి త్యాగాలను గుర్తిస్తూ వారి శక్తిని రెండింతలు చేసేలా ప్రతి ఒక్కరు మహి ళలకు సహ కరించాలి, అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా రేపు పరేడ్ గ్రౌండ్ వేదికగా ఇందిరా మహిళా శక్తి మిషన్- 2025 విడుదల చేయనున్నారు. ఈ ఏడాది మహిళా స్వయం సహాయక బృందాల విజయాలతో పాటు భవిష్యత్ కర్తవ్యా లను నిర్దేశిస్తూ ఇందిరా మహిళ శక్తి మిషన్ %-% 2025.. మహిళల ఆర్థిక స్వేచ్ఛ, ఉపాధి కల్పన, సంపద సృష్టిపై ప్రభుత్వం ఫోకస్ పెట్టింది. ఐకమ త్యమే మహాబలం అనే నానుడిని నిజం చేసేలా ఒకే గొడుగు కిందకు గ్రామీణ, పట్టణ స్వయం సహాయక సంఘాలు రానున్నాయి. స్వయం సహాయక సంఘాల పరిధిని విస్తృత పరిచేలా సభ్యుల అర్హత వయసు పెంచనున్నారు. కిశోర బాలికలు, వయో వృద్ధుల ఆర్థిక భద్రత, సామాజిక మద్దతు కోసం నూతన స్వయం సహాయక సంఘాలను ఏర్పాటు చేయనున్నారు. సభ్యుల కనీస వయస్సు 18 సంవత్సరాల నుంచి 12 సంవత్సరాలకు తగ్గింపుతో పాటు గరిష్ట వయసు 60 సంవత్సరాల నుంచి 65 సంవత్సరాలకు పెంపుదల చేశారు. మహిళా సంఘాలకు రూ. 21,632 కోట్ల రుణాలు 2,25,110 సూక్ష్మ, మధ్య తరహా సంస్థల ఏర్పాటురూ. 110 కోట్లతో 22 జిల్లాల్లో చురుకుగా ఇందిరా మహిళా శక్తిభవనాలనిర్మాణంరాష్ట్రవ్యాప్తంగా అందుబాటులోకి 214 ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లుగ్రామీణ ఉత్పత్తులను ప్రపంచ మార్కెట్ తో అనుసంధానించడం కోసం మాదాపూర్ లోనీ శిల్పారామంలో రూ. 9 కోట్లతో ఇందిరా మహిళా శక్తి బజార్ ప్రారంభంమహిళా సంఘాలకు పాఠశాల యూనిఫామ్ కుట్టే పనిని అప్పగించడం ద్వారా రూ. 30 కోట్ల ఆదాయం ప్రతి ప్రభుత్వ పాఠశాలలో మహిళా సంఘాల ద్వారా అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఏర్పాటుఅమ్మ ఆదర్శ పాఠశాలల ఆధ్వర్యంలో ఇప్పటికే రూ. 634 కోట్ల విలువగల 23,701 పనులుమహిళా సంఘ సభ్యులకు రెండు లక్షల రుణ బీమా, 10 లక్షల ప్రమాద బీమా400 మందికి రూ. 40 కోట్ల ప్రమాద బీమా చెల్లింపు32 జిల్లాల్లో అందుబాటులోకి 32 మొబైల్ ఫిష్ రిటైల్ ట్రక్కులు, ప్రతి ట్రక్కుపై ఆరు లక్షల సబ్సిడీమహిళా సంఘాల ద్వారా 1000 మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తి కి ఏర్పాట్లుమహిళా సంఘాల ద్వారా 600 ఆర్టిసి అద్దె బస్సుల నిర్వహణ.



## కార్యక్రమాలు పటిష్టంగా అమలు

### -మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

**టి మీడియా,ఫిబ్రవరి 7,కూసుమంచి :** ప్రభుత్వ కార్యక్రమాలను పటిష్టంగా అమలు చేయాలని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖామాత్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. శుక్రవారం మంత్రి కూసుమంచి క్యాంప్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తో కలిసి సాగు, త్రాగునీటి సరఫరా, మున్నేరు రిటైనింగు వాల్, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, రోడ్డు మరమ్మతు, అభివృద్ధి తదితర అంశాలపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూలి ఖమ్మం జిల్లాలో రైతులు వేసిన పంటలో ఒక్క ఎకరం కూడా ఎండి పోవద్దని, పంట పొలాలకు అవసరమైన నీరు ప్రణాళికాబద్ధంగా రైతులకు అందించాలని అన్నారు. నాగార్జున సాగర్, పాలేరు రిజర్వాయర్లలో ఉన్న నీటిని సమర్థవంతంగా వినియోగించుకోవాలని మంత్రి ఆదేశించారు. నీటి పారుదల శాఖ అధికారులు నిరంతరం క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలని, నీరు వృధా కాకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని, చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందేలా పకడ్బందీగా పర్యవేక్షించాలని అన్నారు. సాగునీరు విడుదల షెడ్యూల్ రైతులకు సమాచారం అందించాలని అన్నారు. భక్త రామదాసు, సీతారామ ఎత్తిపోతల పథకానికి సంబంధించి పాలేరు నియోజకవర్గంలో భూసేకరణ పెండింగ్ బిల్లుల సమాచారం అందించాలని అన్నారు. జిల్లాలో మంజూరైన చెక్ డ్యాంలకు ప్రతిపాదనలు తయారు చేసి యూ.టి. ల నిర్మాణానికి టెండర్లు పిలవాలని మంత్రి ఆదేశించారు. నీటిపారుదల శాఖకు సంబంధించి పనులు గ్రౌండింగ్ అయ్యేలా కార్యాచరణ చేపట్టాలని అన్నారు. మున్నేరు నది రిటైనింగ్ వాల్ నిర్మాణానికి 176 ఎకరాల భూమి సేకరించాల్సి ఉందని, భూములు కోల్పోతున్న వారికి ప్రత్యామ్నాయంగా ప్రభుత్వ భూమిని ఇచ్చి, భూసేకరణ చేసేలా అధికారులు రైతులతో చర్చలు జరపాలని అన్నారు. భూనిర్వాసితులకు అభివృద్ధి చేసిన భూములు ప్రత్యామ్నాయంగా అందించి త్వరగా రిటైనింగ్ వాల్ నిర్మాణానికి అవసరమైన భూమి సేకరణ చేయాలని మంత్రి సూచించారు. రిటైనింగ్ వాల్ నిర్మాణానికి సంబంధించి పనుల పురోగతిపై రోజువారి నివేదిక అందించాలని మంత్రి అధికారులను ఆదేశించారు.

రిటైనింగ్ నిర్మాణ పురోగతిని ప్రతిరోజు పర్యవేక్షించాలని, ఎప్పటికప్పుడు నిర్మాణ అప్డేట్స్ తనకు అందజేయాలని మంత్రి అన్నారు. మున్నేరు నదికి నిర్మించాల్సిన 17 కిలోమీటర్ల రిటైనింగ్ వాల్ లో 7 కిలోమీటర్ల మేర ప్రభుత్వ భూమి అందుబాటులో ఉందని, ప్రస్తుతం ఇక్కడ పనులు లక్ష్యాల మేరకు వేగంగా జరిగేలా చూడాలని మంత్రి ఆదేశించారు. మిషన్ భగీరథ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి త్రాగునీటి సరఫరా ఇబ్బందులను పరిశీలించి క్షేత్ర వాస్తవిక నివేదిక అందించాలని అన్నారు. రాబోయే వేసవి కాలంలో ఒక్క గ్రామంలో కూడా త్రాగునీటి ఇబ్బంది ఉందని వార్త రావద్దని, మిషన్ భగీరథ ద్వారా లేదా స్థానిక వనరుల ద్వారా త్రాగునీటి సరఫరా పటిష్టంగా అందేలా కార్యాచరణ అమలు చేయాలని మంత్రి అన్నారు.

మద్దులపల్లి మార్కెట్ రోడ్డు అభివృద్ధి కోసం అవసరమైన భూసేకరణ త్వరగా పూర్తిచేసి రోడ్లు భవనాల శాఖ అధికారులకు సదరు భూమి అప్పగించాలని మంత్రి తెలిపారు. రోడ్డు నిర్మాణంలో ఎక్కడైనా పేదలు ఇండ్లు కోల్పోతే వారికి ఇందిరమ్మ ఇండ్ల పథకం క్రింద మంజూరు చేయాలని అన్నారు. రోడ్లు భవనాల శాఖ పరిధిలో వరదల కారణంగా దెబ్బతిన్న రోడ్ల శాశ్వత మరమ్మత్తులు టెండర్లు చేపట్టి పనులు ప్రారంభించాలని అన్నారు.

పైలట్ ప్రాజెక్ట్ క్రింద ప్రతి మండలంలో ఎంపిక చేసిన గ్రామంలో మంజూరు చేసిన ఇందిరమ్మ ఇండ్ల పనులు ప్రారంభించేలా కార్యాచరణ అమలు చేయాలని అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం ప్రారంభించలేని పేదలు ఎవరైనా ఉంటే వారికి చేయూత నిచ్చి నిర్మాణ పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని మంత్రి తెలిపారు. ఈ సమీక్షా సమావేశంలో ఆర్ అండ్ బి ఎస్ఇ హేమలత, ఇర్రిగేషన్ ఎస్ఇ ఎం. వెంకటేశ్వర్లు, ఖమ్మం ఆర్డీఓ నరసింహా రావు, వివిధ శాఖల ఇఇ లు యుగంధర్, అనన్య, పుష్పలత, వాణిశ్రీ, డిఇ లు, ఏఇలు సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

మండల / నియోజక వర్గం /
జిల్లా స్థాయి విలేకరులు / మార్కెటింగ్
ఏజెంట్లు కావలెను
కేంద్రప్రభుత్వ డిజిటల్ మీడియా (2021) గైడ్ లైన్స్‌కి లోబడి నిర్వహణలో ఉన్న జీఎస్టీ లైసెన్స్ కలిగిన టీమీడియా (డిజిటల్) లో పని చేయడానికి మండల / నియోజక వర్గం / జిల్లా స్థాయి విలేకరులు / మార్కెటింగ్ ఏజెంట్లు కావలెను.
అనుభవం ఉన్న వారికీ ప్రాధాన్యత, కొత్త వారికీ అవకాశం కలదు.
వివరాలకు కోసం : 8919710365, 7382990365, 8498972434 కాల్ / మెసెజ్ చేయండి.
GSTIN:36FDKPS1308P1ZX
Spot Speed NEWS T MEDIA టి-మీడియా
సామాజికం ... ప్రజల పక్షం...
epaper,www.tmedia.net.in YouTube facebook